పౌష్టికాహారం కరువాయే..

- టీబీ రోగులకు అందని పౌష్టికాహారం
- గత ప్రభుత్వ హయాంలో 'నిక్షయ మిత్ర' కిట్ల పంపిణీ
- సరైన ఆహారం అందక ఇబ్బందులు పడుతున్న రోగులు



క్షయ వ్యాధి గ్రస్తులకు గత ప్రభుత్వంలో పంపిణీ చేసిన పౌష్టికాహార సరుకులు



క్షయ వ్యాధి గ్రస్తులకు కిట్ పంపిణీ చేస్తున్న వైద్యశాఖాధికారులు(పాత చిత్రం)

ముప్పాళ్ళ: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నలభై మందిలో ఒకరు క్షయ(టీబీ) వ్యాధి బారిన పడుతున్నారు. క్రమం తప్పకుండా మందులతో పాటుగా పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నుంచి తొందరగా బయట పడవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే బాధితుల్లో ఎక్కువ మంది పేదవారే ఉంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైద్యుల ద్వారా గ్రామాల్లో వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు, వైద్య పరీక్షలు నిర్వహించేవారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా మందులు అందజేయడంతో పాటు బాధితులకు పౌష్టికాహారం అందజేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పౌష్టికాహార కిట్లు అందక రోగం నుంచి బయటపడటానికి పౌష్టికాహారం కొనుక్కునేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు.

సత్తెనపల్లి టీబీ యూనిట్ పరిధిలో

సత్తెనపల్లి టీబీ యూనిట్ సత్తెనపల్లి రూరల్, పట్టణం, ముప్పాళ్ళ, పెదకూరపాడు మండలాల పరిధిలో గతేడాదికి 350 మంది రోగులకు మందులు అందించగా.. 345 మందికి పైగా వ్యాధి నయం కావడంతో బయటపడ్డారు. ప్రస్తుతం 130 మంది ఆరు నెలల కోర్సు పూర్తి చేసుకున్నారు. ఇంకా 135 మంది చికిత్స పొందుతున్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడాలి. అప్పుడే రోగం నయం అవుతుంది. దీంతో పాటుగా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాల్సి ఉంటుంది. మందులు మధ్యలో వదిలేస్తే వ్యాధి తిరగబడే ప్రమాదం ఉంది.

గతంలో పౌష్టికాహారం పంపిణీ

క్షయ వ్యాధిగ్రస్తులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పవర్ గ్రిడ్ సంస్థ సౌజన్యంతో నిక్షయ మిత్ర పేరుతో పౌష్టికాహర కిట్లు పంపిణీ చేసింది. రాగి పిండి 3 కేజీలు, కందిపప్పు కేజీన్నర, శనగవిత్తనాలు కేజీ, పామాయిల్ 200 గ్రాములు, గోధుమ పిండి కేజీ, బెల్లం అరకేజీ చొప్పున కిట్‌లో ఇచ్చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో కిట్ సరఫరా పూర్తిగా నిలిపివేశారు. ఆ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వంలో పౌష్టికాహార కిట్లు పంపిణీ ఊసే లేకుండా పోయింది. దీంతో క్షయ వ్యాధి బారిన పడిన పేద, మధ్యతరగతి రోగులు రోగాన్ని తగ్గించుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆదుకోవడానికి దాతలు ముందుకు వస్తే బాగుంటుందని స్థానిక వైద్యులు, అధికారులు కోరుతున్నారు. అప్పటి కలెక్టర్ చొరవతో ప్రతి రోగిని ఒక ప్రభుత్వ ఉద్యోగి దత్తత తీసుకోవాలని సూచన మేర రోగులకు కొంత మేర ఉపశమనం దక్కింది. కొంత మంది ఉద్యోగులు ఆమేర స్పందించటంతో కొంత మందికి పౌష్టికాహారం తీసుకొని రోగాన్ని తగ్గించుకున్నారు.

క్షయ వ్యాధి లక్షణాలు

క్షయ వ్యాధి ఉన్న రోగులు తరచుగా శ్వాసకోశ లక్షణాలతో బాధపడుతూ ఉంటారు. అలసట, తలనొప్పి, ఆకలి తగ్గడం, చెమటలు పట్టడం వంటి వాటితో పాటు సాయంత్రం సమయంలో జ్వరం కనిపిస్తుంది. రెండు వారాల పాటు తీవ్రమైన దగ్గు ఉంటే కళ్లె పరీక్ష చేయించుకుంటే మంచిది. ఒక వేళ కళ్లె పరీక్షలో మనకు క్షయ వ్యాధి బయటపడకుంటే ఎక్స్‌రే తీయించుకోవాలి.

నివారణ మార్గాలు..

వ్యాధి వ్యాప్తి నివారించాలంటే వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చేతులను ముఖానికి అడ్డం పెట్టుకోవాలి. మాట్లాడుతున్నప్పుడు నోటి తుంపర్లు ఎదుటివారి మీద పడకుండా చూసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడం లాంటి పనులను చేయకూడదు.

పౌష్టికాహారం చాలా అవసరం



క్షయ బాధితులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స, మందులు అందిస్తాం. రోగనిరోధక శక్తి పెంపొందించడానికి పౌష్టికాహారం చాలా అవసరం. ఆర్థిక స్తోమత లేని నిరుపేదలు పోషకాహారం తీసుకోవడం కొంత భారమే. పవర్ గ్రిడ్ సంస్థ క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేసేది. అంతకు ముందు ఏఎంజీ సంస్థ అందించేది. ప్రస్తుతం కిట్లు రావడం లేదు. దాతలు ముందుకు వచ్చి వారికి పోషకాహారం కిట్లను అందిస్తే బాగుంటుంది.
–ఎస్.జోసెఫ్ స్టాలిన్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, టీబీ యూనిట్, సత్తెనపల్లి

వ్యాధి పట్ల నిర్లక్ష్యం పనికిరాదు



క్షయ బాధితులు క్రమం తప్పకుండా మందులు ఆరు నెలలు వాడాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. మొదటి రెండు నెలలు వాడిన తర్వాత మళ్లీ రక్త పరీక్ష చేసి వ్యాధి ఏ దశలో ఉందో నిర్ధారించి, మందులను అందిస్తాం. పోషకాహారం కోసం ప్రతి నెల రూ.1000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుంది. మద్యపానం, ధూమపానం, బయట ఆహారం వంటి వాటికి దూరంగా ఉండాలి. మందులు, పోషకాహారం క్రమంతప్పకుండా తీసుకుంటే వ్యాధి నుంచి కోలుకోవచ్చు.
–పి.రమాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి, ముప్పాళ్ళ

క్లుప్తంగా

ఆసుపత్రికి కుర్చీల వితరణ



పెదకూరపాడు: ఎన్టీఆర్ 29వ వర్ధంతిని సందర్భంగా మండల తెలుగు యువత అధ్యక్షుడు గల్లా శివ స్థానిక ఆసుపత్రికి పది కుర్చీలు వితరణ చేశారు. శనివారం టీడీపీ జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్ వైద్య సిబ్బందికి వాటిని బహూకరించారు. ఆసుపత్రి వైద్య బృందం గల్లా శివ, రమేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



అచ్చంపేట: చామర్రు గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న అచ్చంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే పది మంది విద్యార్థులకు చామర్రు రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసమూర్తి శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. సైకిళ్లను హైదరాబాద్‌కు చెందిన పిలక కృష్ణమూర్తి జ్ఞాపకార్థం వారి కుమారులు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తివిశెట్టి రాంబాబు, సూదా వెంకటేశ్వరరావు, కోటమర్తి అనిల్‌కుమార్, కృష్ణశాస్త్రి, గొల్లపూడి అనిల్ పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం



సత్తెనపల్లి: పట్టణంలోని పాత బస్టాండ్‌లో వీధి కుక్కలు శనివారం స్వైర విహారం చేశాయి. రోడ్డు దాటేందుకు పలువురు బిక్కుబిక్కుమంటూ భయపడ్డారు. రాకపోకలు సాగించాలంటే వీధి కుక్కలతో హడలిపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.

16 పంచాయతీల్లో పింఛన్ల తనిఖీ



సత్తెనపల్లి: వివిధ రుగ్మతలతో బాధపడుతూ ప్రభుత్వ సామాజిక పింఛన్లు పొందుతున్న వారిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రెండు బృందాలు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో శనివారం పర్యటించాయి. ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి. ప్రదీప్ ఆధ్వర్యంలో వైద్యుల బృందాలు కంకణాలపల్లి, భీమవరం, లక్కరాజుగార్లపాడు, కంటేపూడి, కొమెరపూడి, నందిగామ, గుడిపూడి, పెదమక్కెన, రెండో బృందం ధూళిపాళ్ల, బృగుబండ, కందులవారిపాలెం, రెంటపాళ్ల, పాకాలపాడు, కట్టమూరు, అబ్బూరు, పణిదం గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను నమోదు చేసుకున్నారు.

బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించాలి

రెంటచింతల: మండలంలో చేపట్టిన మాచర్ల – దాచేపల్లి బైపాస్ రోడ్డు(ఎన్‌హెచ్–167 ఏడీ) 5 కి.మీ నిర్మాణంలో భాగంగా స్థానిక రామకృష్ణ గురుకుల పాఠశాల సమీపంలో నిర్మిస్తున్న గోలివాగు హైలెవల్ పనులను నాణ్యతతో చేపట్టాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు.

భవనం పైనుంచి పడి పెయింటర్ మృతి

దాచేపల్లి: ప్రమాదవశాత్తు అపార్టుమెంట్ పై నుంచి కిందపడి పెయింటర్ మృతి చెందిన సంఘటన శనివారం దాచేపల్లిలో జరిగింది. దాచేపల్లికి చెందిన షేక్ కరీముల్లా (40) పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఓ అపార్ట్‌మెంట్‌లో పనులకు వెళ్లాడు. పై భాగంలో తాడు సాయంతో పెయింటింగ్ వేస్తుండగా తాడు తెగి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వైద్య చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల తరలిస్తుండగా మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ల పరిశీలనకు బృందాలు

మాచర్ల: పట్టణంలో దివ్యాంగుల పింఛనుకు సంబంధించి 854 మంది వివరాలను ప్రత్యేక బృందాలు పరిశీలిస్తాయని మున్సిపల్ చైర్మన్ డి.వేణుబాబు శనివారం తెలిపారు. లబ్ధిదారులు అందుబాటులో ఉండాలన్నారు.

సమన్వయకర్త సుధీర్ భార్గవ్‌రెడ్డితో కన్వీనర్ల సమావేశం



డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డితో కన్వీనర్లు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ గజ్జల సు.దీర్ భార్గవ్‌రెడ్డితో నియోజకవర్గంలోని పార్టీ కన్వీనర్లు శనివారం సమావేశమయ్యారు. సమన్వయకర్తగా డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండలాల అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు, నక్కా శ్రీనివాసరావు, వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డితో చర్చించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో డాక్టర్ సు.దీర్ భార్గవ్‌రెడ్డి పలువురుతో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు భార్గవ్‌రెడ్డిని సన్మానించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

పెదకూరపాడు : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు అర్తిమల్ల రమేష్, గ్రామ అధ్యక్షుడు చెన్నుపాటి బుల్లిబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ప్రజలకు ముఖ్యమంత్రిగా అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఎన్నారై మాగులూరి భాను ప్రకాష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామ్‌గోపాల్‌రావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం అంజనేయులు, నాయి బ్రాహ్మణ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, వైస్ ఎంపీపీ చాంద్ బాషా, నాయకులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే..

నకరికల్లు: రాష్ట్ర రాజకీయాలను కొత్త అర్థం చెప్పిన గొప్ప నాయకుడు ఎన్.టి.రామారావు అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. రామారావు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక ఆయన విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అన్నదానం చేపట్టారు. నాగోతు శౌరయ్య, మైలవరపు కాశీ, మైలవరపు కిశోర్, షేక్.అలీబాషా, డీకొండ రామదాసు, మహానంది, పాలాంజి, గుజ్జుల పొలు, షేక్.జాను పాల్గొన్నారు.

రిమాండ్ ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలి



నిత్యావసరాల నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

సత్తెనపల్లి: సబ్ జైల్లో రిమాండ్ ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలని సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, రెండవ అదనపు సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్ సూచించారు. పట్టణంలోని సబ్ జైల్‌ను శనివారం న్యాయమూర్తులు సందర్శించారు. సబ్ జైల్‌లోని పరిసరాలను నిశితంగా పరిశీలించారు. అక్కడ ఉన్న ఆహారం, నిత్యవసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. న్యాయవాదిని నియమించుకోలేని రిమాండ్ ముద్దాయిలకు ప్రభుత్వం న్యాయవాదిని నియమించి, ఉచితంగా న్యాయ సేవలను అందిస్తుందని తెలిపారు. డాక్టర్ గిరిరాజు, సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం, పట్టణ ఎస్ఐ పవన్ కుమార్, లీగల్ వలంటీర్ షేక్ సుభాని పాల్గొన్నారు.

రేపటి నుంచి పశువైద్య శిబిరాలు

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశువైద్య శిబిరాలు జరుగుతాయని రాజుపాలెం పశువైద్యాధికారి వీరయ్య శనివారం తెలిపారు. 20న అంచులవారిపాలెం, బలిజేపల్లి, 21న బ్రాహ్మణపల్లి, 22న రాజుపాలెం, 23న నెమలిపురి, 24న దేవరంపాడు, ఇనిమెట్ల, 25న గణపవరం, 27న అనుపాలెం, 28న చౌటపాపాయపాలెం, వీరమ్మకాలనీ, 29న రెడ్డిగూడెం, లక్ష్మీపురం తండా, 30న రామిరెడ్డిపేటలో శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు.

బెల్లంకొండలో..

బెల్లంకొండ: మండలంలో పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశు వైద్యుడు బాలకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నాగిరెడ్డిపాలెం, 21న మాచాయపాలెం, 24న నందిరాజుపాలెం, 25న చంద్రాజుపాలెం, 27న కందిపాడు, 28న పాపాయపాలెం, 29న ఎమ్మాజీగూడెం, 30న మన్నెసుల్తాన్ పాలెంలో నిర్వహిస్తారని తెలిపారు.

అచ్చంపేట: ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి స్వాతీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గేదెలు, దూడలు, జీవాలకు నట్టల నివారణ మందు, గర్భకోశ పరీక్షలు, జీవాలకు బొబ్బ టీకాలు అందిస్తామన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్



పట్టణంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ రమణాకాంతరెడ్డి



పట్టణంలో ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ

సత్తెనపల్లి: దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని డివిజన్‌లో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజాభాగస్వామ్యం అవసరమని సత్తెనపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి జీవీ రమణాకాంతరెడ్డి అన్నారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం న్యూ ఇయర్ – క్లీన్ స్టార్ థీమ్‌తో తన కార్యాలయంలో పరిశుభ్రతా చర్యల్లో ఆయన పాల్గొని చెత్తాచెదారాన్ని తొలగింప చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమణాకాంతరెడ్డి మాట్లా డుతూ ఈనెల నుంచి డిసెంబర్ వరకు 12 నెలల పాటు నెలకొక థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టడం, గార్బేజ్ క్లీనింగ్, టాయిలెట్ల క్లీనింగ్ వంటివి చేయడం జరిగిందన్నారు. ముందుగా ప్రతిజ్ఞ చేశారు. ఆర్డీవో కార్యాలయ ఏఓ చంద్రా రెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, సర్వే డీఐ విజయ్ కుమార్, డిప్యూటీ ఏఎస్ఓ శివ బాబు, ఆర్ఐ బోస్‌బాబు, అధికారులు ఉన్నారు.

- స్వచ్ఛ సత్తెనపల్లిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ జెండా ఊపి ఆమె ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ సత్తెనపల్లిని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమైందన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తురకా మేరీగ్రేస్‌లు మాట్లాడారు. మానవహారం నిర్వ హించి ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, శానిటేషన్ సెక్రటరీలు, సిబ్బంది, పాల్గొన్నారు.
- సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి నందిగామ గ్రామంలో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని చౌత్ర సెంటర్ వద్ద గ్రామ నాయకులు, ప్రజలు తో కలిసి వీధులు శుభ్రం చేశారు. మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఆళ్ల సాంబయ్య, సర్పంచ్ బి.రమాదేవి, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతలో భాగస్వామ్యులు కావాలి

నకరికల్లు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీపీఓ భాస్కర్ రెడ్డి అన్నారు. స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా సచివాలయం నుంచి శనివారం స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. ముందుగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడవ శనివారాన్ని స్వచ్ఛత దివస్‌గా పాటించాలన్నారు. ప్లాస్టిక్ సంచులను వినియోగం మానివేయాలన్నారు. దేశాన్ని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని శుభ్రపరచడంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ ప్రసాద్, శివయ్య పాల్గొన్నారు.

క్రోసూరులో స్వచ్ఛ ఆంధ్ర

క్రోసూరు: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధర్యంలో శనివారం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి అందుకూరు రోడ్డు సెంటర్‌లో పంచాయతీ సెక్రటరీలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీపీ కోటయ్య, సర్పంచ్ మల్లా చందమామ, సెక్రటరీ కె.వెంకయ్య, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

ముప్పాళ్ళ: స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీఓ, తహసీల్దార్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పారిశుద్ధ్యం చేపట్టారు. వ్యర్థాలను తొలగించి, అనంతరం ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, ఎంపీడీవో పీజే విలియమ్స్, పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యశాలలో..

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండలో ఆయుష్ వైద్యశాలలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం జరిగింది. డాక్టర్ ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఆయుష్ సిబ్బంది వెంకటరామయ్య, యోగా టీచర్ భూక్యా హనుమంతరావు నాయక్ పాల్గొన్నారు .



నందిగామలో పరిసరాల పరిశుభ్రతలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, నాయకులు



క్రోసూరులో మానవ హారం

వేలం పాటలు వాయిదా

క్రోసూరు: అచ్చంపేట మండలం ఓర్వకల్లులో ఫిబ్రవరి 12న జరిగే గంగాదేవీ తిరునాళ్ల నిర్వహణకు సంబంధించి శనివారం నిర్వహించాల్సిన వేలం పాటలు వాయిదా పడినట్లు ఈవో ఎం.కోటేశ్వరరావు తెలిపారు. ఒక్క రంగుల రాట్నం తిప్పుకునేందుకు వేలంపాటలు జరగగా రూ.98 వేలకు కె.ఆనంద్‌కుమార్ దక్కించుకున్నట్లు తెలిపారు. మిగతా హక్కులకు జరిగే పాటల వివరాలు త్వరలో తెలియజేస్తామన్నారు.

సర్టిఫికెట్ కోర్సు శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక



క్రోసూరు: పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఆదేశాల మేరకు అందుకూరు ఎంపీయూపీ పాఠశాల ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ డి.ధర్మారావు ఇంగ్లీషు శిక్షణ సర్టిఫికెట్ కోర్సుకు ఎంపికైనట్లు ఎంఈఓ వై.ప్రసాదరావు శనివారం తెలిపారు. 30 రోజులపాటు బెంగళూరులో (రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్)జరిగే ఈ శిక్షణకు జిల్లా నుంచి ఎంపికైన ఇద్దరిలో డి.ధర్మారావు ఒకరని చెప్పారు. ఎంఈవో–2 ఎం. గణేష్, పాఠశాల హెచ్‌ఎం తిరుమల రెడ్డి ఆయనను అభినందించారు.

నాసిరకంగా సీసీ రోడ్డు




రాజుపాలెం: న్యూ బోధనంలో ఉన్న ఎస్సీ కాలనీలలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా సీసీ రోడ్డు వేస్తున్నారు. సీసీ రోడ్డుకు ఇరువైపులా సైడు కాల్వలు నిర్మించకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కంకరు, సిమెంటు తక్కువ వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు సీసీ రోడ్డును పరిశీలించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కళ్లం మునెమ్మకు ఘన నివాళులు



బొల్లవరం(ముప్పాళ్ళ): మరణంలోను కళ్లం మునెమ్మ జీవించి ఉన్నారని, అవయవదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన సీపీఎం నాయకురాలు, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) పూర్వ సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షురాలు కళ్ళం మునెమ్మ సంస్మరణ సభ శనివారం జరిగింది. సీపీఎం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడారు. సమసమాజ నిర్మాణం కోసం కళ్ళం మునెమ్మ, సత్యనారాయణరెడ్డి దంపతులు అందరికీ ఆదర్శవంతంగా పనిచేశారన్నారు. మునెమ్మ తన దేహాన్ని మెడికల్ కళాశాలకు దానం చేసి వైద్య విద్యార్థులు పాఠాలు నేర్చుకునేందుకు ఉపయోగపడ్డారన్నారు. నరసరావుపేటలో నిర్మాణమవుతున్న విజ్ఞానకేంద్రానికి ఐదు లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించారన్నారు. మల్లీశ్వరి, గద్దె ఉమశ్రీ, గుంటుపల్లి రజని, మన్నెం శారద పాల్గొని మునెమ్మ సేవలను కొనియాడారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

డ్రోన్‌తో నిఘా



క్రోసూరు: జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ప్రతి రోజు మండలంలో రాత్రిళ్లు పోలీసు పెట్రోలింగ్, డ్రోన్ ద్వారా నిఘా నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నాగవరం గ్రామంలో శనివారం డ్రోన్ ఎగుర వేసినట్లు తెలిపారు. క్రోసూరు, హసనాబాద్, నాగవరం గ్రామాల్లో పెట్రోలింగ్ చేసినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

రెంటచింతల: తుమృకోటలో ఈ నెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తోట అమరలింగయ్య(60) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో లింగయ్య తీవ్రంగా గాయపడ్డాడు.